ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రజానేస్తం జ్వాల దినపత్రికలో పనిచేయడానికి విలేకరులు కావలెను

రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో ప్రతినిధుల నియామకం

ప్రజాసేవ పట్ల ఆసక్తి, జర్నలిజం పట్ల మక్కువ ఉన్న సమర్థులైన వారు మా పత్రికతో పనిచేయడానికి సంప్రదించగలరు.

సంప్రదించవలసిన పేరు:
చెన్నగాని పురుషోత్తం
ఫోన్: 9603068864

www.prajanesthamjwalanews.com | epaper.prajanesthamjwalanews.com

నవంబర్ 29 ఆదివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 50 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SUNDAY NOVEMBER 29 2026 | VOL:1 | ISSUE: 50 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

మహిళా రిజర్వేషన్ల అమలుపై వెనక్కి తగ్గేది లేదు: మోదీ

నారీశక్తికి ఇచ్చిన హామీని నెరవేరుస్తాం

పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో 33 శాతం కోటా

అడ్డంకులు ఎదురైనా అధిగమిస్తామని స్పష్టీకరణ

దశాబ్దాల ఆకాంక్షకు కార్యరూపం కల్పిస్తామని వెల్లడి

మహిళల నుంచి తనకు లేఖలు వచ్చాయని ప్రకటన

నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు



మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే

నారీశక్తికి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పార్లమెంట్‌తో పాటు రాష్ట్రాల శాసనసభల్లో

(మిగతా 3వ పేజీలో..)

డీలిమిటేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద సిఫార్సు

లోక్‌సభ పరిశీలనకు పంపాలని ద్రౌపది ముర్ము సూచన

లోక్‌సభ సభ్యుల సంఖ్య 850కి పెంచే ప్రతిపాదన

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలే లక్ష్యం

ఇంటర్నెట్ డెస్క్: నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభ పరిశీలనకు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సిఫార్సు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన శాసన ప్రక్రియలో ఇది కీలక పరిణామంగా మారింది. నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సిఫార్సు ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆర్టికల్ 117(3) కింద సిఫార్సు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(3) ప్రకారం రాష్ట్రపతి ఈ సిఫార్సు చేసినట్లు లోక్‌సభ సచివాలయం శనివారం వెల్లడించింది. ఈ నిబంధన ప్రకారం కొన్ని కీలక బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించే ప్రక్రియలో రాష్ట్రపతి సిఫార్సు అవసరమవుతుంది.

(మిగతా 3వ పేజీలో..)



తెలంగాణలో రాష్ట్రపతి పాలన తప్పదు: బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు

2029లో లోక్‌సభతో పాటే అసెంబ్లీ ఎన్నికలూ ఉంటాయన్న లక్ష్మణ్

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లు 2027లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్న బీజేపీ నేత

దక్షిణాదికి నష్టం జరగకుండానే నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందన్న లక్ష్మణ్



తెలంగాణలో శాసనసభ గడువు ముగిశాక, సుమారు ఆరు నెలల పాటు రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కన్వీనర్, రాజ్యసభ సభ్యుడు

(మిగతా 3వ పేజీలో..)

ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరం..ఏక్యూఐ 454కు చేరిక

పీఎం2.5 కాలుష్యానికి వాహనాలే ప్రధాన కారణమని గుర్తింపు

వాతావరణ మార్పులతో పేరుకుపోతున్న కాలుష్య కారకాలు

వారాంతంలో పరిస్థితి మరింత దిగజారే అవకాశం



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరోసారి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. శనివారం ఉదయం గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 450 మార్కును మించడంతో నగరవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉదయం 6:51 గంటల సమయానికి ఏక్యూఐ 454గా నమోదైంది. అర్ధరాత్రి దాటిన తర్వాత

(మిగతా 3వ పేజీలో..)

21 ఏళ్ల తర్వాత కలిసిన హరీశ్‌రావు, జగ్గారెడ్డి

జగ్గారెడ్డి నివాసంలో సత్యనారాయణ వ్రతానికి హాజరైన మాజీ మంత్రి

నూతన వధూవరులను ఆశీర్వదించిన హరీశ్‌రావు

తమ మధ్య వ్యక్తిగత విభేదాలు లేవన్న హరీశ్‌రావు

ఇద్దరు నేతల కలయికతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి



సంగారెడ్డి, నవంబర్ 28:లిలి తెలంగాణ రాజకీయాల్లో భిన్న పార్టీలకు చెందిన ఇద్దరు కీలక నేతలు ఒకే వేదికపై కనిపించడం ఆసక్తికరంగా మారింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు శనివారం సంగారెడ్డిలోని ఆయన నివాసానికి వెళ్లారు. జగ్గారెడ్డి ఇంట్లో నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయిరెడ్డి, కోడలు పాలక్ పటేల్‌లను హరీశ్‌రావు ఆశీర్వదించారు. సుమారు 21 ఏళ్ల తర్వాత ఇద్దరు నేతలు ఒక కుటుంబ వేడుకలో కలుసుకోవడంతో ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రాజకీయాలకు సంబంధం లేదన్న జగ్గారెడ్డి

తమ కలయిక వెనుక ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

2004లో హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఇద్దరం కలిసి భోజనం చేసేవారమని గుర్తుచేశారు. తాను కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఆయనను కలవలేదని, 21 ఏళ్ల అనంతరం మళ్లీ కుటుంబ వేడుకలో కలుసుకున్నామని తెలిపారు. తన కుమార్తె వివాహానికి హరీశ్‌రావును ఆహ్వానించలేకపోయానని, ఈ కార్యక్రమానికి మాత్రం తప్పకుండా రావాలని ఆహ్వానించినట్లు చెప్పారు.

(మిగతా 2వ పేజీలో..)

టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులపై మంత్రి సమీక్ష

వైద్య మౌలిక సదుపాయాల పురోగతిపై ఆరా

ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల నిర్మాణంపై చర్చ

ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయడమే లక్ష్యం



తెలంగాణలో వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

(మిగతా 3వ పేజీలో..)

కేంద్ర డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే గ్రీన్ సిగ్నల్.. స్టాలిన్ పెట్టిన షరతులకు మోదీ సర్కార్ ఓకే!

డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ప్రకటించిన డీఎంకే పార్టీ

స్టాలిన్ ప్రతిపాదించిన నిబంధనలకు కేంద్రం అంగీకారం

లోక్‌సభలో డీఎంకేకు ఉన్న 22 మంది ఎంపీల బలం ఎంతో కీలకం



కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) మద్దతు ఇచ్చేందుకు అంగీకరించింది. పార్టీ అధ్యక్షుడు

(మిగతా 3వ పేజీలో..)

మద్దతిస్తే ప్రజలకు తీరని ద్రోహమే.. డీలిమిటేషన్ బిల్లుపై కాక్రోచ్ జనతా పార్టీ

నవంబర్ 30 ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును వ్యతిరేకించాలని విపక్షాలకు పిలుపు

బీజేపీకి అనుకూలంగా సరిహద్దులను మార్చే 'గెర్రీమాండరింగ్' ప్రమాదంపై హెచ్చరిక

డీఎంకే, ఎన్‌సీపీ వైఖరి మార్పుపై అశుతోష్ రంకా ఘాటు విమర్శలు

మహిళా రిజర్వేషన్ల ముసుగులో సరిహద్దుల కుట్ర సాగుతోందని ఆరోపణ



కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు మద్దతు ఇవ్వడం అంటే ప్రజా తీర్పును ఘోరంగా వంచించడమేనని కాక్రోచ్ జనతా పార్టీ

(మిగతా 3వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

తెలంగాణలో రాష్ట్రపతి పాలన తప్పదు: బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ కె. లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2028 డిసెంబరుతో ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగుస్తుందని, ఆ తర్వాత 2029 మే లేదా జూన్‌లో లోక్‌సభ ఎన్నికలతో పాటే రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగే సూచనలున్నాయని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాల దృష్ట్యా రాష్ట్రపతి పాలన అనివార్యం కావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.దేశవ్యాప్తంగా 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానాన్ని దశలవారీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని లక్ష్మణ్ తెలిపారు. ఇందులో భాగంగా 2027లో 'జమిలి ఎన్నికల' బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ఆలోచన ఉందని చెప్పారు. తొలి దశలో భాగంగా, అసెంబ్లీ గడువు ఏడాది అటూఇటూగా ఉన్న 17 రాష్ట్రాలకు లోక్‌సభతో కలిపి ఎన్నికలు నిర్వహించవచ్చని, ఆ జాబితాలో తెలంగాణ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. తరచూ ఎన్నికల వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, బోధన కుంటుపడుతోందని, ఈ సమస్యల పరిష్కారానికే జమిలి ఎన్నికలు అవసరమని ఆయన అన్నారు.త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), మహిళా రిజర్వేషన్ బిల్లులు ఆమోదం పొందుతాయని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్‌పై కొన్ని వర్గాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ సీట్ల సంఖ్యకు అనుగుణంగా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంచాలని కేంద్రం నిర్ణయించిందని, దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని హామీ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించడం వల్లే ఓట్ల సంఖ్య తగ్గిందన్నారు. హైదరాబాద్‌లో దాదాపు 45 శాతం బోగస్ ఓట్లు తొలగించారని, దీనిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణల్లో పసలేదని, ఆధారాలు చూపడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాగా, ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ తెలిపారు.

డీలిమిటేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోద సిఫార్సు

మొదటి పేజీ తరువాయి)

ఈ రాజ్యాంగపరమైన ప్రక్రియలో భాగంగానే డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభ పరిశీలనకు తీసుకోవాలని రాష్ట్రపతి సూచించారు.

లోక్‌సభ సభ్యుల సంఖ్య 850కి పెంపు ప్రతిపాదన

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త విధానం ప్రకారం లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్యను 550 నుంచి 850కి పెంచే అవకాశం ఉంది. ఇందులో రాష్ట్రాల నుంచి గరిష్ఠంగా 815 మంది, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 35 మంది ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు సమాచారం. అలాగే రాష్ట్రాల శాసనసభల్లో సభ్యుల గరిష్ఠ సంఖ్యను 500 నుంచి 650కి పెంచే ప్రతిపాదన కూడా ఉంది.

శాసనసభల్లోనూ స్థానాల పెంపు

పార్లమెంట్‌తో పాటు రాష్ట్రాల శాసనసభల్లోనూ ప్రస్తుత స్థానాల సంఖ్యను 50 శాతం పెంచాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రణాళికగా కథనంలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా పెరిగే స్థానాలకు అనుగుణంగా ప్రాతినిధ్య వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నారు.

2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్ల అమలు లక్ష్యం

లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను ముందుకు తీసుకొచ్చింది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మహిళలకు కేటాయించే స్థానాలను గుర్తించి, 2029 సాధారణ ఎన్నికల నాటికి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలన్నది కేంద్రం లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లుపై పార్లమెంట్‌లో జరిగే చర్చ, తదుపరి శాసన ప్రక్రియపై ఆసక్తి నెలకొంది.

మహిళా రిజర్వేషన్ల అమలుపై వెనక్కి తగ్గేది లేదు: మోదీ

మొదటి పేజీ తరువాయి)

లక్ష్యం నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమించి ముందుకు సాగుతామని భరోసా ఇచ్చారు. మహిళలకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్న సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.

దశాబ్దాల ఆకాంక్షకు కార్యరూపం

మహిళలకు రాజకీయాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధన కోసం తాను కూడా ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నానని తెలిపారు. దేశంలోని అనేక మంది మహిళలు ఈ అంశంపై తనకు లేఖలు రాశారని, వ్యక్తిగతంగా కలిసి తమ ఆకాంక్షలను వెల్లడించారని చెప్పారు. మహిళల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ప్రత్యేక సమావేశాల్లో కీలక బిల్లులు

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మోదీ 'ఎక్స్' వేదికగా మహిళా రిజర్వేషన్లపై తన అభిప్రాయాలను వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ల అమలుతో ముడిపడిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ముందడుగు వేస్తున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన కొత్త బిల్లులను ప్రత్యేక సమావేశాల్లో చర్చకు తీసుకురానున్నట్లు సమాచారం. ఈ బిల్లులపై పార్లమెంట్‌లో జరిగే చర్చతో మహిళా ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మరోసారి ప్రాధాన్యం సంతరించుకోనుంది.

ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరం.. ఏక్యూఐ454కు చేరిక

మొదటి పేజీ తరువాయి)

కాలుష్య తీవ్రత అకస్మాత్తుగా పెరిగి, సూచీ 400 మార్కును అధిగమించింది. నవంబర్ 21న నమోదైన 449 తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం గమనార్హం.శుక్రవారం గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో (220-226 మధ్య) ఉన్నప్పటికీ, రాత్రికి రాత్రే పరిస్థితి గణనీయంగా దిగజారింది. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్-3 సహా ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత గరిష్ఠ స్థాయిలో నమోదైంది.తాజా విశ్లేషణల ప్రకారం, ఢిల్లీలోని పీఎం 2.5 కాలుష్యానికి ప్రధాన కారణం వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలేనని స్పష్టమైంది. మొత్తం కాలుష్యంలో వాహనాల వాటా 32 శాతంగా ఉండగా, బయోమాస్ వ్యర్థాలను కాల్చడం ద్వారా 22.8 శాతం కాలుష్యం వెలువడుతోంది. శుక్రవారం సమాచారం అందించిన 57 పర్యవేక్షణ కేంద్రాలలో 36 కేంద్రాలు 'పూర్' కేటగిరీలో, మరో 4 కేంద్రాలు 'వెరీ పూర్' విభాగంలో ఉన్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా కాలుష్యం పెరగడానికి దోహదపడుతున్నాయి. గాలి వేగం మందగించడంతో కాలుష్య కారకాలు వాతావరణంలోనే పేరుకుపోయి, పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తున్నాయి. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం, వారాంతంలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోనే కొనసాగి, ఆ తర్వాత మరింత క్షీణించి 'వెరీ పూర్' స్థాయికి పడిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు అప్రమత్తంగా ఉండాలని, వీలైనంత వరకు ఇంటికే పరిమితం కావాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

21 ఏళ్ల తర్వాత కలిసిన హరీశ్‌రావు, జగ్గారెడ్డి

మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలు వేరు.. వ్యక్తిగత సంబంధాలు వేరు

హరీశ్‌రావు బీఆర్ఎస్‌లో అగ్రనేతగా ఉన్నారని, తాను కాంగ్రెస్‌లో ఒక స్థాయి నాయకుడిగా కొనసాగుతున్నానని జగ్గారెడ్డి పేర్కొన్నారు. గతంలో అనేక కార్యక్రమాలకు ఆయనను ఆహ్వానించలేకపోయానని, హరీశ్‌రావు పదేళ్లపాటు మంత్రిగా ఉన్న సమయంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కలవలేదని వివరించారు. తమ మధ్య జరిగిన ఈ సమావేశానికి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం ఆపాదించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

వ్యక్తిగత విమర్శలు చేసుకోలేదన్న హరీశ్‌రావు

ఈ సందర్భంగా హరీశ్‌రావు కూడా స్పందిస్తూ, తాను, జగ్గారెడ్డి ఎప్పుడూ వ్యక్తిగతంగా ఒకరినొకరు విమర్శించుకోలేదని తెలిపారు. రాజకీయంగా వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ వ్యక్తిగత సంబంధాలు వేరని ఇద్దరు నేతల వ్యాఖ్యలు సూచించాయి. చాలాకాలం తర్వాత జరిగిన ఈ భేటీతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులపై మంత్రి సమీక్ష

మొదటి పేజీ తరువాయి)

ఇందులో భాగంగా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సచివాలయంలో ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, ఇతర వైద్య సదుపాయాల నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యంగా టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తయ్యాయనే అంశంపై మంత్రి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మెడికల్ కాలేజీల నిర్మాణంపై చర్చ

ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణ పనులతో పాటు విద్యార్థుల వసతి గృహాల ఏర్పాటు, జనరల్ ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపైనా మంత్రి సమీక్షించారు. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించారు. వివిధ ప్రాంతాల్లో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పనుల పర్యవేక్షణకు సూచనలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, ఇతర వైద్య మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులకు సంబంధించిన పనుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని స్పష్టం చేశారు.

కేంద్ర డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే గ్రీన్ సిగ్నల్.. స్టాలిన్ పెట్టిన షరతులకు మోదీ సర్కార్ ఓకే!

మొదటి పేజీ తరువాయి)

ఎంకే స్టాలిన్ ప్రతిపాదించిన ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని పార్టీ ఉన్నత స్థాయి వర్గాలు వెల్లడించాయి. "మా నాయకుడు పట్టుబట్టిన అంశాలను కేంద్రం ఆమోదించింది.. అందుకే బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాం" అని సీనియర్ నేతలు స్పష్టం చేశారు.పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకే వైఖరి ఈ ఓటింగ్‌లో అత్యంత కీలకంగా మారింది. లోక్‌సభలో స్థానాలను 50 శాతం పెంచినప్పటికీ తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.18 శాతం ప్రాతినిధ్య వాటా తగ్గకూడదని స్టాలిన్ గతంలోనే డిమాండ్ చేశారు. అలాగే 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న సీట్ల విభజనను మరో 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించాలని కోరారు. సవరించిన ప్రతిపాదనలో రాష్ట్రాల నిష్పత్తి వాటా మారకుండా అందరికీ సమానంగా 50 శాతం సీట్లు పెంచేందుకు కేంద్రం సిద్ధపడటంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వకపోతే జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపట్టాల్సి వస్తుందని, సాధారణ మెజారిటీతోనే దాన్ని అమలు చేసే అవకాశం ఉందని బీజేపీ డీఎంకేకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తమిళనాడులోని అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) డీఎంకే తీరును తీవ్రంగా తప్పుబట్టింది. డీఎంకే తన ద్వంద్వ వైఖరిని వీడి, బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తామని బహిరంగంగా ప్రకటించాలని సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే సవాల్ విసిరింది. సభ నుంచి వాకౌట్ చేయడం లేదా ఓటింగ్‌కు దూరంగా ఉండటం బీజేపీకి లొంగిపోవడమేనని విమర్శించింది.

మద్దతిస్తే ప్రజలకు తీరని ద్రోహమే.. డీలిమిటేషన్ బిల్లుపై కాక్రోచ్ జనతా పార్టీ

మొదటి పేజీ తరువాయి)

(సీజేపీ) అభిప్రాయపడింది. నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్ష పార్టీలన్నీ ఐక్యంగా వ్యతిరేకించాలని కోరింది. పార్లమెంట్‌లో జరుగుతున్న పరిణామాలను దేశ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొందది. అధికార పక్ష కుతంత్రాలకు కొమ్ముకాసే నేతలను, పార్టీలను చరిత్ర ఎప్పటికీ క్షమించదని స్పష్టం చేసింది.అభిజీత్ దిప్కే నేతృత్వంలోని ఈ యువజన ఉద్యమ వేదిక.. డీలిమిటేషన్ వెనుక దాగి ఉన్న అసలైన ప్రమాదం 'గెర్రీమాండరింగ్' (అధికార పార్టీకి అనుకూలంగా నియోజకవర్గాల సరిహద్దులను అక్రమంగా మార్చడం) అని ఆరోపించింది. పోలింగ్ బూత్ స్థాయి గణాంకాలు, ఓటరు జాబితాలు, పాత ఓటింగ్ సరళిని ఉపయోగించుకుని బీజేపీకి శాశ్వత రాజకీయ ప్రయోజనం చేకూరేలా సరిహద్దులను విభజించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. తగిన స్వతంత్ర పర్యవేక్షణ, రక్షణలు లేకుండా సరిహద్దులను తిరిగి గీస్తే, భవిష్యత్ ఎన్నికల్లో ప్రజాభిప్రాయం మారినా సభలో అది ప్రతిబింబించకుండా పోతుందని పేర్కొంది.డీఎంకే, ఎన్‌సీపీ (శరద్ పవార్ వర్గం) వంటి పార్టీలు తమ వైఖరిని మార్చుకుని బిల్లుకు అనుకూలంగా సంకేతాలు ఇవ్వడంపై సీజేపీ కో-కన్వీనర్లు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా సీట్లు 50 శాతం పెరుగుతున్నాయనే నెపంతో ఈ పార్టీలు మద్దతిస్తున్నాయని, అయితే అసోంలో జరిగిన సరిహద్దుల మార్పులను ఒకసారి పరిశీలిస్తే ఎలాంటి 'గెర్రీమాండరింగ్' ప్రమాదంలో పడుతున్నారో అర్థమవుతుందని హెచ్చరించారు. స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగ విలువలపై రాజీపడితే వచ్చే తరాలు, దేశ యువత తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళా రిజర్వేషన్ల ముసుగులో కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల సరిహద్దుల తారుమారుకు ప్రయత్నిస్తోందని సీజేపీ ఆరోపించింది. మహిళా కోటా చట్టం ఇప్పటికే ఆమోదం పొంది అమలుకు నోచుకోలేదని, దానిని సాకుగా చూపి ఎన్నికల మ్యాప్‌ను మార్చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని స్పష్టం చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రజల విశ్వసనీయతను కోల్పోయిందని ఆరోపిస్తూ, అలాంటి వ్యవస్థ చేతుల్లో సరిహద్దుల పునర్విభజన పెడితే ప్రజాస్వామ్యానికే పెను ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

తెలంగాణలో 17 నుంచి 26కు పెరగనున్న ఎంపీ సీట్ల సంఖ్య.. డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

ఎక్స్ వేదికగా కీలక నిర్ణయాన్ని వెల్లడించిన కేటీఆర్

బిల్లుకు అనుకూలంగా ఓటు వేయనున్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు

తెలంగాణ లోక్‌సభ స్థానాల సంఖ్య 17 నుంచి 26కు పెరిగే అవకాశం

2051 వరకు రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా మారకుండా రక్షణపై హర్షం

డీఎంకే బాటలోనే మద్దతు ప్రకటించిన తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా తమ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఓటు వేస్తారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.డీలిమిటేషన్ అంశంపై తమ వైఖరి ఎప్పుడూ స్పష్టంగానే ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో ఎలాంటి తగ్గుదల ఉండకూడదని, తెలంగాణకు జరిగే ఏ అన్యాయాన్నీ సహించేది లేదని తేల్చిచెప్పారు. 2051 వరకు అంతరాష్ట్ర ప్రాతినిధ్య నిష్పత్తి మారకుండా రక్షణ కల్పించాలనేది తమ డిమాండ్ అని గుర్తుచేశారు. అన్ని రాష్ట్రాల్లో సీట్లను 50 శాతం సమానంగా పెంచాలన్న తాజా ప్రతిపాదన తమ ఆందోళనలను పరిష్కరిస్తోందని తెలిపారు.ఈ సవరించిన బిల్లు ఆమోదం పొందితే తెలంగాణ లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 17 నుంచి ఏకంగా 26కు పెరుగుతుందని కేటీఆర్ వివరించారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయడానికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉన్నామని, దానికి నియోజకవర్గాల పునర్విభజన మార్గం సుగమం చేస్తోందని అన్నారు. కాగా, తమిళనాడులోని డీఎంకే సైతం తమ ప్రధాన డిమాండ్లను ఆమోదించినందుకుగానూ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ వెనువెంటనే బీఆర్ఎస్ కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకోవడం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం రాత్రి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. డీలిమిటేషన్ బిల్లు, ప్రత్యేక పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఏఐసీసీ నిర్వహించే సమావేశాలకు ఆయన హాజరుకానున్నారు. అలాగే డీలిమిటేషన్ అంశంపై కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించనున్నారని, ఆ ప్రెస్‌మీట్‌లో సీఎం రేవంత్ పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటు పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఎంపీలందరినీ ఢిల్లీకి రావాలని ఇప్పటికే పార్టీ ఆదేశించింది. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల సహా పలు అంశాలపై పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన విధానంపై సీఎం రేవంత్ ఎంపీలకు దిశానిర్దేశం చేయనున్నారని, ఒకటి, రెండు రోజుల పాటు సీఎం ఢిల్లీలోనే ఉండనున్నారని సమాచారం.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

దొంగతనం, గంజాయి విక్రయాల ముఠా గుట్టురట్టు.. ముగ్గురు అరెస్ట్

- **రూ.15 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం -- 6.2 కిలోల గంజాయి పట్టివేత**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

కోదాడ పట్టణంలో ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించిన ఘటనతో పాటు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును కోదాడ పట్టణ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15 లక్షల విలువైన 9.150 తులాల బంగారు ఆభరణాలు, 12.3 తులాల వెండి ఆభరణాలు, రూ.16 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్‌తో పాటు మొత్తం 6.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.



వ్యసనాల కోసం దొంగతనాలు.. గంజాయి విక్రయాలు

కోదాడ పట్టణానికి చెందిన షేక్ మస్తాన్, సొంటి సందీప్ అలియాస్ నటరాజ్, ఆలేటి గోపి స్నేహితులుగా ఉంటూ మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడ్డారు. వ్యక్తిగత ఖర్చుల కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడటంతో పాటు, ఆ డబ్బుతో భద్రాచలం ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి కోదాడ, పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.గత అక్టోబర్ 20న దసరా పండుగ రోజున రాత్రి బంజారా కాలనీలోని ఓ ఇంటి ప్రహరీ గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఇనుప రాడ్‌తో ఇంటి తాళం పగలగొట్టి బీరువాను ధ్వంసం చేసి బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించారు. ఈ ఘటనపై కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.దొంగిలించిన బంగారు హారాల్లో రెండింటిని ఖమ్మంలోని గౌతమ్ బుద్ధ ఏ టు జెడ్, సాయి సద్గురు జువెలరీ దుకాణాల్లో విక్రయించి వరుసగా రూ.3.60 లక్షలు, రూ.2.65 లక్షలు పొందినట్లు పోలీసులు తెలిపారు. ఈ విక్రయాలకు సహకరించిన బచ్చలకూరి పవన్‌కు రూ.40 వేల కమీషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన డబ్బును మద్యం, జూదం, బెట్టింగ్‌లు, గోవా పర్యటనలు తదితర ఖర్చులకు వినియోగించినట్లు విచారణలో తేలింది.

భద్రాచలం నుంచి గంజాయి కొనుగోలు

ఆభరణాల విక్రయం ద్వారా వచ్చిన డబ్బులో కొంత మొత్తంతో సందీప్, మస్తాన్ కలిసి భద్రాచలం ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి సుమారు 8 కిలోల గంజాయిని రూ.40 వేలకు కొనుగోలు చేశారు. చెరో నాలుగు కిలోల చొప్పున తీసుకొని విక్రయించేందుకు సిద్ధమయ్యారు.ఈ క్రమంలో నవంబర్ 19న బాలాజీనగర్ శివారులోని ఈనాడు పుల్లయ్య వెంచర్ వద్ద సుమారు నాలుగు కిలోల గంజాయితో ఉన్న షేక్ మస్తాన్‌ను పోలీసులు అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మస్తాన్ అరెస్టు విషయం తెలుసుకున్న సందీప్ హైదరాబాద్‌కు వెళ్లి తన మొబైల్ ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తికి విక్రయించాడు. తన వద్ద ఉన్న గంజాయిలో కొంత విక్రయించి, మరికొంత వినియోగించుకున్నాడు. మిగిలిన 2.2 కిలోల గంజాయిని కోదాడకు తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు.

పక్కా నిఘాతో పట్టుకున్న పోలీసులు

పోలీసుల నిఘాలో భాగంగా నవంబర్ 27న సాయంత్రం కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం దేగ బాబు ఫంక్షన్ హాల్ సమీపంలోని చెట్ల వద్ద గంజాయితో ఉన్న సొంటి సందీప్, ఆలేటి గోపిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సందీప్ ఇచ్చిన సమాచారం మేరకు దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలతో పాటు ఖమ్మంలోని నగల దుకాణాల్లో విక్రయించిన ఆభరణాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న సొత్తు:

గంజాయి -- 6.2 కిలోలు

బంగారు ఆభరణాలు -- 9.150 తులాలు

వెండి ఆభరణాలు -- 12.3 తులాలు

నగదు -- రూ.16,000

ఒక మొబైల్ ఫోన్

ఈ కేసులో షేక్ మస్తాన్‌ను నవంబర్ 19న అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మిగిలిన ఇద్దరు నిందితులను కూడా న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు

ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన కోదాడ పట్టణ సీఐ కె. శివశంకర్, ఎస్ఐలు అజయ్ కుమార్, ఉపేందర్ రెడ్డి, కానిస్టేబుళ్లు రాంబాబు, వెంకటేశ్వర్లు, లోకేష్, నవీన్, సందీప్ రెడ్డి, ఇన్నారెడ్డి, శ్రీనివాస రెడ్డిలను జిల్లా ఎస్పీ నరసింహ అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ శివశంకర్, ఎస్ఐ అజయ్ కుమార్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడియంపై విమర్శలు చేస్తే సహించేది లేదు.. కాంగ్రెస్ నేతల హెచ్చరిక!

ధర్మసాగర్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

కడియం శ్రీహరిపై విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల నాయకులు హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం ధర్మసాగర్ మండలం చిన్నపెండ్యాల గ్రామంలోని బీవైజీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహకారంతో కడియం శ్రీహరి నియోజకవర్గంలో రూ.1,600 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. ఇంతటి అభివృద్ధి జరుగుతున్నప్పటికీ కడియం శ్రీహరిని జీరోగా అభివర్ణించడం విడ్డూరమని వారు విమర్శించారు. చిల్పూర్ మండలంలోనే రూ.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మరో ఆరు నెలల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో కార్యాలయాల సముదాయం ప్రారంభానికి సిద్ధమవుతుందని వారు వెల్లడించారు.పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు 55 వేల మెజారిటీతో తమ నాయకుడిపై నమ్మకాన్ని చాటుకున్నారని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కలిసి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని వారు తెలిపారు. అభివృద్ధి పనులను గుర్తించకుండా విమర్శలు చేయడం తగదని తాటికొండ



రాజయ్యను ఉద్దేశించి కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారు. కడియం శ్రీహరిపై నిరాధార విమర్శలు చేయడం మానుకోవాలని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గడ్డమీది సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర నాగరాజు గౌడ్, జిల్లా నాయకుడు బొమ్మిశెట్టి బాలరాజు, ఏడవెల్లి మల్లారెడ్డి, సర్పంచులు చేతబోయిన రాజు యాదవ్, భూక్య వెంకటేష్, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సమ్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, నాయకులు రంగు రమేష్, తాళ్లపల్లి బిక్షపతి, గజ్జల దామోదర్, మోటం శ్రీను, ఇల్లందుల హరిబాబు పాల్గొన్నారు.

ఏడాదిలో 26 కేసులు.. 44 మంది నేరస్తులకు జైలు శిక్షలు

- **హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష.. 11 మందికి జీవిత ఖైదు**

సూర్యాపేట, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

నేరస్తులకు చట్టప్రకారం శిక్షలు పడేలా పటిష్ట దర్యాప్తు చేపట్టాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ పోలీసు అధికారులకు సూచించారు. నేరస్తులకు శిక్షలు పడటం ద్వారా వారి ప్రవర్తనలో మార్పు రావడంతో పాటు నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు.శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు, నేరస్తులకు శిక్షల అమలు తదితర అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజన్ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాలు తగ్గి ప్రజలు భయభ్రాంతులు లేకుండా స్వేచ్ఛగా జీవించాలంటే నేరస్తులకు శిక్షలు పడేలా పటిష్ట దర్యాప్తు అవసరమని అన్నారు. పోలీసు అధికారులు న్యాయస్థానాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ప్రతి కేసులో నిందితుడికి నేరంతో సంబంధాన్ని నిరూపించే బలమైన సాక్ష్యాధారాలు సేకరించాలని, సంఘటనా స్థలంలో లభించే ఆధారాలను శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి కేసు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

26 కేసుల్లో 44 మందికి శిక్షలు

గత ఏడాది కాలంలో జిల్లాలో 26 కేసుల్లో 44 మంది నేరస్తులకు వివిధ రకాల జైలు శిక్షలు అమలైనట్లు పోలీసు శాఖ వెల్లడించింది. మోతే మండలంలో మూఢనమ్మకాల కారణంగా కన్నకూతురిని హత్య చేసిన కేసులో తల్లికి ఉరిశిక్ష విధించినట్లు తెలిపింది. హత్య కేసుల్లో 11 మందికి జీవిత ఖైదు, బాలలపై అత్యాచార కేసుల్లో ఇద్దరికి 30 ఏళ్లకు పైగా జైలు శిక్షలు విధించినట్లు పేర్కొంది. ఏడేళ్లకు పైగా శిక్షలు పడిన కేసుల్లో నలుగురికి, ఏడేళ్లలోపు శిక్షలు పడిన 18 కేసుల్లో 26 మందికి శిక్షలు అమలైనట్లు వివరించింది.

పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సన్మానం

నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రఘురామయ్య, లింగయ్య,



సవీందర్, కళ్యాణితో పాటు పటిష్ట ఆధారాలతో చార్జిషీట్లు దాఖలు చేసిన సీఐలు శివశంకర్, సత్యంలను ఎస్పీ సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కోర్టు విధులను సమర్థవంతంగా నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, కానిస్టేబుళ్లు నాగబ్రహ్మం, యాసిన్, శివరాం, సైదులు, శోభన్‌బాబు, యాదగిరి, శ్రీనివాస్‌లను కూడా అభినందించారు.ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డీఎస్పీలు ప్రసన్నకుమార్, శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ డీఎస్పీలు, స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బీ, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పెట్టుబడులు, గేమ్స్ పేరుతో మోసపోవద్దు

సూర్యాపేట, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధిక లాభాల ఆశతో ఆన్‌లైన్ పెట్టుబడులు, గేమ్స్‌లో డబ్బులు పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ సూచించారు.సైబర్ నేరాల నివారణ, ఆర్థిక భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఎస్పీ సైబర్ సెక్యూరిటీ సిబ్బంది, డీఎస్పీలు, సీఐలతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ పెట్టుబడులు, అధిక లాభాల పేరుతో ఆకర్షణీయమైన ఆఫర్లు చూపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమ్స్, పెట్టుబడుల పేరుతో ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత ఆఫర్లను నమ్మి డబ్బులు పెట్టడం వల్ల తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.యువతతో పాటు ప్రజలు, పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరూ ఆర్థిక భద్రత, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సూచించారు. గుర్తుతెలియని ఆన్‌లైన్ పెట్టుబడి ప్లాట్‌ఫారమ్‌లు, అధిక లాభాల హామీలు, డబ్బులతో కూడిన ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. ఏదైనా పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.ఆర్థిక లావాదేవీల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండటం ద్వారా కష్టార్జితాన్ని కాపాడుకోవచ్చని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ మోసాల నివారణలో భాగస్వాములై తమ కుటుంబ సభ్యులకు, ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.



జ్యోతిబా ఫూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఆత్మకూర్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం నీరుకుల్ల గ్రామంలో మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్య, సామాజిక సమానత్వం, మహిళా సాధికారత కోసం ఆయన చేసిన పోరాటాన్ని, అణగారిన వర్గాల అభ్యున్నతికి అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సోషల్ సైంటిస్ట్ మేడ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. జ్యోతిబా ఫూలే సమాజంలో నెలకొన్న కులవివక్ష, అసమానతలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త అని అన్నారు. విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమని నమ్మి, మహిళలు, అణగారిన వర్గాలకు విద్యా అవకాశాలు కల్పించేందుకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను నేటి తరానికి పరిచయం చేయడంతో పాటు, సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధి దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మడికొండ రత్నాకర్, సర్పంచ్ తడక నీరజ శ్రీనివాస్, వార్డు సభ్యులు, నీలం రాజు, ఉడుత రాజేందర్, పసుల లక్ష్మినారాయణ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

నీమాస్త్రం తయారీపై రైతులకు అవగాహన

కీతవారిగూడెంలో ప్రకృతి సిద్ధమైన పురుగుల నివారణ పద్ధతిపై ప్రదర్శన

సూర్యాపేట, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



గ్రామీణ అనుభవ వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు నీమాస్త్రం తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరులోని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ చివరి సంవత్సరం విద్యార్థులు సూర్యాపేట జిల్లా కీతవారిగూడెం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా నీమాస్త్రం తయారీకి అవసరమైన పదార్థాలు, తయారీ విధానం, పంటలను ఆశించే వివిధ రకాల హానికర పురుగుల నివారణలో దాని ఉపయోగాలను విద్యార్థులు రైతులకు వివరించారు. స్థానికంగా లభించే వేప ఆధారిత పదార్థాలతో నీమాస్త్రాన్ని తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు.రసాయనిక పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో పంటలను రక్షించుకోవడానికి నీమాస్త్రం ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు. రైతులు సైతం ఇటువంటి సేంద్రియ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు అనంత రాములు, కాట్రేపుల నరేంద్ర, జాలా అంజయ్య, కాట్రేపుల రామారావు, కందుల శ్రీను, బడేటి వినయ్, యల్లావుల మధు, సలిగంటి నాగేశ్వరరావు, కాట్రేపుల సురేష్, కాట్రేపుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సదస్సు కరపత్రం ఆవిష్కరణ

సూర్యాపేట, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 13న నిర్వహించనున్న ఆవిర్భావ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని జేఏసీ జిల్లా నాయకులు అవిరెండ్ల నాగేంద్రబాబు నేరేడుచర్ల మండలంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ, తెలంగాణలో సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన లక్ష్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మతపరమైన మైనారిటీలకు అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన వాటా కల్పించాలనే డిమాండ్‌తో జేఏసీ చైర్మన్ డా. విశారాధన్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య ఉద్యమం కొనసాగుతోందని తెలిపారు.మహాత్మా జ్యోతిరావు పూలే, సాహు మహారాజ్, డా. బి.ఆర్. అంబేద్కర్, మాన్యవర్ కాన్షీరాం ఆశయాలు, ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో జేఏసీ పనిచేస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కాలంగా పలు ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించామని, కొన్ని అంశాల్లో ఫలితాలు సాధించామని తెలిపారు.డిసెంబర్ 13న సూర్యాపేట జిల్లాలో నిర్వహించనున్న ఆవిర్భావ సదస్సుకు రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, విద్యావంతులు, యువత పాల్గొనాలని నాగేంద్రబాబు ఆహ్వానించారు.

సమాజ మార్పుకు చదువే ఆయుధమని చాటిన మహనీయుడు జ్యోతిరావు పూలే

హరిపిరాల, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



మహాత్మా జ్యోతిరావు పూలే 136వ వర్ధంతి సందర్భంగా తొర్రూరు మండలం హరిపిరాల గ్రామంలోని స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త తలారి అశోక్ మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే ఈ దేశానికి విద్యా మార్గాన్ని చూపిన దిక్సూచి అని కొనియాడారు. సతీసహగమనం వంటి సామాజిక దురాచారాల నిర్మూలనకు, మహిళా విద్యాభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా నేడు అంతరిక్షంలో రాకెట్లు నడిపే స్థాయికి ఎదగడానికి పూలే వంటి సంఘసంస్కర్తలు వేసిన పునాదులే కారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చెంచర్ల స్వాతి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి. రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తొలగించే వరకు పోరాటం ఆగదు

- **ఏడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు.. ఉద్యమానికి మద్దతుగా నిలవాలని ప్రజాప్రతినిధులకు షేక్ షావలి విజ్ఞప్తి**

జవహర్‌నగర్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తొలగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడో రోజుకు చేరుకున్నాయి. నవంబర్ 22 నుంచి డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ దీక్షలకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజిక సంస్థల నాయకులు సంఘీభావం ప్రకటిస్తున్నారు.కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం, చెన్నాపురం క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించిన దీక్షా శిబిరంలో పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి మాట్లాడుతూ, డంపింగ్ యార్డు ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యను రాజకీయాలకు అతీతంగా చూడాలని, మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ దీక్షా శిబిరానికి వచ్చి బాధిత ప్రజలకు మద్దతు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి డంపింగ్ యార్డు తొలగింపునకు కృషి చేయాలని కోరారు.ఇప్పటివరకు స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాత్రమే దీక్షా శిబిరాన్ని సందర్శించి బాధితులకు సంఘీభావం తెలిపారని, ఆయనకు పోరాట కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని షావలి పేర్కొన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన సమస్య కాదని, ప్రజల ఆరోగ్యం, జీవించే హక్కు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రజా సమస్యగా గుర్తించాలని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, మేధావులు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

వివిధ సంఘాల నాయకుల సంఘీభావం

దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపిన వారిలో టీయూజేఏసీ నాయకుడు బాస్సువాడ రాజు, బీఎస్పీ నాయకుడు బిర్రు యాకస్వామి, ఆప్ పార్టీ నాయకులు హేమ సుదర్శన్ జిల్లోజు, ఏ. బాబులాల్ పవర్, బీసీ నాయకుడు వడ్డెర నర్సన్న, టీయూసీఐ నాయకుడు వి. ప్రవీణ్, పీఓడబ్ల్యూ నాయకులు జయసుధ, డి. స్వరూప, బహుజనసత్తా నాయకుడు బండకింది సింగరయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.అలాగే టీయూజేఏసీ నాయకులు కళ్లెపు నర్సయ్య, వేముల యాదగిరి, కనకం ఆంజనేయులు, సీపీఐ నాయకుడు దర్శనం యాదగిరి, తెలంగాణ రైతుకూలి సంఘం నాయకుడు జి. వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకురాలు బి. అనసూయ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకురాలు ఎస్. కనకమ్మ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకురాలు ఎస్. స్వరూప, ఆప్ నాయకుడు మహ్మద్ మొయినుద్దీన్ తదితరులు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు సమస్య పరిష్కారంలో ప్రభుత్వాలు మరింత జాప్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. నాలుగు మండలాల పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కుల సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు దీక్షా శిబిరాన్ని సందర్శించి బాధిత ప్రజలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.డంపింగ్ యార్డు తొలగించి బాధిత ప్రాంతాల ప్రజలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన దీక్షలతో డంపింగ్ యార్డు తొలగింపు డిమాండ్‌ను మరింత బలంగా వినిపించారు.



రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో సూర్యాపేట పోలీసుల సత్తా

సూర్యాపేట, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ రాష్ట్ర మూడవ పోలీస్ డ్యూటీ మీట్‌లో సూర్యాపేట జిల్లా పోలీసు సిబ్బంది ప్రతిభ చాటుతూ రెండు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అభినందించి సన్మానించారు.గత వారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో నిర్వహించిన మూడవ పోలీస్ డ్యూటీ మీట్‌లో యాదాద్రి జోన్ తరఫున సూర్యాపేట జిల్లా పోలీసు సిబ్బంది వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ విభాగంలో మాదకద్రవ్యాల గుర్తింపు, తనిఖీల్లో డాగ్ రోలెక్స్‌తో కలిసి పనిచేసిన హెడ్ కానిస్టేబుల్ సతీష్ స్వర్ణ పతకం సాధించారు. అలాగే నేరస్తుల పరిశీలన (పోర్ట్రెయిట్ పార్లే) విభాగంలో హెడ్ కానిస్టేబుల్ కల్యాణ్ చక్రవర్తి స్వర్ణ పతకం గెలుచుకున్నారు.ఈ సందర్భంగా ఇద్దరు విజేతలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహను కలవగా, ఆయన వారిని అభినందించి సన్మానించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని అన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో వృత్తిపరమైన నైపుణ్యం, ప్రతిభ, అంకితభావంతో పనిచేసే సిబ్బందికి ఎల్లప్పుడూ గుర్తింపు, ప్రోత్సాహం ఉంటాయని తెలిపారు. రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచిన సిబ్బంది జాతీయ పోలీస్ డ్యూటీ మీట్‌కు తెలంగాణ రాష్ట్రం తరఫున ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. జాతీయస్థాయిలోనూ ఇదే స్ఫూర్తితో ప్రతిభ చాటి మరిన్ని పతకాలు సాధించి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.జిల్లా పోలీస్ శాఖలో సిబ్బంది ప్రతిభను ప్రోత్సహిస్తూ, వృత్తి నైపుణ్యాల పెంపునకు నిరంతరం సహకారం అందిస్తామని ఎస్పీ తెలిపారు.

కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకున్న 'రాంగ్ నెంబర్' సినీ బృందం

భీమదేవరపల్లి, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని 'రాంగ్ నెంబర్' చిత్ర బృందం శనివారం దర్శించుకుంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చిత్ర విజయాన్ని ఆకాంక్షిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సినిమా బృందానికి ఆశీర్వచనాలు అందించారు. సమాజానికి మంచి సందేశాన్ని అందించేలా రూపొందించిన 'రాంగ్ నెంబర్' చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతూ ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు.సినిమా ద్వారా ప్రజలకు ఉపయోగపడే మంచి విషయాలను తెలియజేయాలనే ఉద్దేశంతో చిత్రాన్ని రూపొందించినట్లు బృంద సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాంబాబు, వినయ్ శర్మ, రవి శర్మ, చిత్ర దర్శకుడు ఏలీయా మోతే, ఛాయాగ్రాహకుడు శ్రీరాజు, కథానాయకుడు చక్రపాణి, నటులు శివప్రసాద్, నితిన్, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్సీ బయోటెక్నాలజీలో గోల్డ్ మెడల్ సాధించిన ముల్కనూర్ బిడ్డ

భీమదేవరపల్లి, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన కాలజ్ఞా విద్యారంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ బయోటెక్నాలజీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంది.ముల్కనూర్ గ్రామానికి చెందిన ఎర్రోజు లలిత--రమణాచారి దంపతుల కుమార్తె అయిన కాలజ్ఞా ఉన్నత విద్యలో ప్రతిభ చాటుతూ ఈ ఘనత సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గ్రామానికి చెందిన యువతి విశ్వవిద్యాలయ స్థాయిలో బంగారు పతకం సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. కాలజ్ఞా విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత విజయాలు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శు భాకాంక్షలు తెలిపారు.

కాకతీయ యూనివర్సిటీ 24వ స్నాతకోత్సవం.. 408 మందికి బంగారు పతకాలు, 91 మందికి పీహెచ్‌డీలు

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ శివప్రతాప్ శుక్లా విద్యార్థులకు పట్టాలు, పతకాలను ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో పరిశోధనలు పూర్తి చేసిన 91 మంది పరిశోధకులకు పీహెచ్‌డీ పట్టాలు, విద్యా ప్రతిభ కనబరిచిన 408 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద సూక్తులను ప్రస్తావించారు. మంచి నడవడిక, నైతిక విలువలతోనే ఉత్తమ వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందని పేర్కొంటూ, యువత సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నిట్ పాలక మండలి చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, విశ్వవిద్యాలయ పర్యటనకు వచ్చిన గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, కేయూ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్ కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని వారు గవర్నర్‌ను కోరారు.

జిల్లాస్థాయి పోటీల్లో హుజూర్‌నగర్ మైనార్టీ గురుకుల బాలికల ప్రతిభ


హుజూర్‌నగర్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



జిల్లాస్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌తో పాటు ఎల్‌నినో అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీలో హుజూర్‌నగర్ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన ఆకాంక్ష, నిఖిత రెడ్డి, గీతిక పోటీల్లో ప్రతిభ చాటి బహుమతులు సాధించారు.చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో నాలుగో బహుమతి, చిత్రలేఖన పోటీలో ద్వితీయ బహుమతి సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. విద్యార్థినులు రెండు విభాగాల్లోనూ బహుమతులు సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ రెహానా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రెహానా మాట్లాడుతూ, విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. చదువుతో పాటు వివిధ రంగాల్లోనూ విద్యార్థినులు రాణిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు.బహుమతులు సాధించిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించి, వారికి మార్గదర్శనం చేసిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థినులు మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉమ్మడి వరంగల్‌కు పెరగనున్న రాజకీయ ప్రాతినిధ్యం!

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ ముఖచిత్రంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానం పెరిగే అవకాశం ఉందనే అంచనాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లా జనాభా 38,20,369 కాగా, ఇందులో 6,79,868 మంది ఎస్సీ జనాభా ఉన్నారు. ఈ జనాభా గణాంకాలను ప్రాతిపదికగా తీసుకుని రూపొందించిన అంచనాల ప్రకారం ప్రస్తుతం ఉన్న 12 అసెంబ్లీ స్థానాలు 19కి, రెండు లోక్‌సభ స్థానాలు మూడుకు పెరిగే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి సగటున సుమారు 1.95 లక్షల జనాభా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే మహిళలకు ఆరు, ఎస్సీలకు నాలుగు స్థానాలు కేటాయించే అవకాశం ఉందనే అంచనాలు వినిపిస్తున్నాయి.జిల్లాల వారీగా పరిశీలిస్తే వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 20 లక్షలకు పైగా జనాభా ఉండటంతో నాలుగు కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉందని అంచనా. ఇందులో హనుమకొండ జిల్లాలో మూడు, వరంగల్ జిల్లాలో ఒక స్థానం పెరగవచ్చని పేర్కొంటున్నారు.సుమారు ఎనిమిది లక్షల జనాభా కలిగిన మహబూబాబాద్ జిల్లాలో కొత్తగా రెండు అసెంబ్లీ స్థానాలు ఏర్పడితే మొత్తం నియోజకవర్గాల సంఖ్య నాలుగుకు చేరే అవకాశం ఉంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మరో కొత్త నియోజకవర్గం ఏర్పడవచ్చని అంచనా వేస్తున్నారు. జనగామ, ములుగు జిల్లాల్లో మాత్రం ప్రస్తుత నియోజకవర్గాల సంఖ్యలో మార్పులు ఉండకపోవచ్చని ఈ గణాంకాల ఆధారంగా విశ్లేషిస్తున్నారు.నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అమలులోకి వస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయ ప్రాతినిధ్యం పెరగడంతో పాటు కొత్త ప్రాంతాలకు అసెంబ్లీ, పార్లమెంటులో ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంటుంది. అయితే నియోజకవర్గాల సంఖ్య, రిజర్వేషన్లు, సరిహద్దులపై తుది నిర్ణయం అధికారిక పునర్విభజన ప్రక్రియలోనే స్పష్టతకు రానుంది.

టీచర్స్ కాలనీలో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ నగరంలోని 60వ డివిజన్ టీచర్స్ కాలనీలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన కోసం సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు. కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో స్థానిక ప్రజలు అధికారులకు, సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.



డెంగ్యూ బాధితుడికి రూ.5 వేల ఆర్థిక సాయం

ధర్మసాగర్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన వక్కల యాదగిరి గత కొన్ని రోజులుగా డెంగ్యూ జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వల్లపు రెడ్డి రామ్ రెడ్డి (రామన్న) ఈరోజు యాదగిరిని స్వయంగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు.అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆపద సమయంలో అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన రామన్నను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో వక్కల కరుణాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొని యాదగిరి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

టీచర్స్ కాలనీ అభివృద్ధికి రూ.50 లక్షలు.. పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన

- **స్థానికులతో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం.. ప్రతి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ**

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ నగరంలోని 60వ డివిజన్ టీచర్స్ కాలనీ అభివృద్ధికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భరోసా కల్పించారు. కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ పనులకు శనివారం స్థానిక కాలనీవాసులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులు సజావుగా, నాణ్యతతో పూర్తయ్యేందుకు స్థానిక ప్రజలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సహకరించాలని కోరారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.టీచర్స్ కాలనీలో చేపట్టనున్న అభివృద్ధి పనులతో స్థానికంగా మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

భూ రీసర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సర్వే, భూ రికార్డుల శాఖ అధికారులు, తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ అధికారులకు నిర్వహించిన భూ రీసర్వే శిక్షణ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ, సీసీఎల్ఏ సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సర్వే పనులతోపాటు డేటా నమోదు ప్రక్రియను సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. దాదాపు వందేళ్ల తర్వాత జరుగుతున్న భూ రీసర్వే ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెంచడంతోపాటు భూ వివాదాలకు పరిష్కారం చూపి రైతులకు స్పష్టమైన భూ హక్కులు కల్పించడం ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. నవంబర్ 20న జారీ చేసిన తాజా సర్క్యులర్, ప్రామాణిక కార్యాచరణ విధానంలోని మార్గదర్శకాలను అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేసి వాటి ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు.రీసర్వే ప్రారంభానికి ముందు ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. పట్టా భూములకు ఫారం-9, ప్రభుత్వ భూములకు ఫారం-10 నోటీసులు జారీ చేయాలని తెలిపారు. సర్వే ప్రారంభానికి నాలుగు రోజుల ముందుగానే పట్టాదారులకు సమాచారం అందించి, భూముల హద్దుల గుర్తింపునకు అవసరమైన గుర్తింపు జెండాలను ఏర్పాటు చేయాలన్నారు.భూభారతి పోర్టల్ నుంచి పొందిన క్షేత్రస్థాయి రిజిస్టర్‌లో మొదటి తొమ్మిది కాలమ్స్ వివరాలు ఆటోమేటిక్‌గా నమోదవుతాయని వివరించారు. 10 నుంచి 14వ కాలమ్స్‌లో ఎల్‌పీఎం నంబర్లు, క్షేత్రస్థాయి విస్తీర్ణ వివరాలను సర్వేయర్లు నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల్లోని వివరాలకు, క్షేత్రస్థాయి కొలతలకు మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటికి గల కారణాలను వ్యాఖ్యల కాలమ్‌లో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు.సబ్ కలెక్టర్ సౌరబ్ శర్మ మాట్లాడుతూ రీసర్వే అనంతరం నోటీసులు జారీ చేసి, ప్రతి గ్రామంలో మూడు నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు, భూముల విస్తీర్ణంలో తేడాలు, ఉమ్మడి ఖాతాల విభజనకు సంబంధించిన సమస్యలను చట్టబద్ధమైన ఆధారాలు,



పరస్పర అంగీకారం ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పూర్తి చేయాలన్నారు.సర్వే పూర్తయిన గ్రామాల క్షేత్రస్థాయి రిజిస్టర్లను గ్రామ పంచాయతీ అధికారుల లాగిన్ ద్వారా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్వేయర్, తహసీల్దార్ స్థాయిలో నాణ్యతా తనిఖీలు నిర్వహించిన అనంతరం కేంద్ర సర్వే కార్యాలయ పరిశీలన ప్రక్రియను పూర్తి చేసి తుది సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. తహసీల్దార్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సర్వే పనుల పురోగతిని పర్యవేక్షించాలని, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో వసంత కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, డిప్యూటీ డైరెక్టర్ సమీనా బేగం, రెవెన్యూ శాఖ జోనల్ అధికారి లావణ్య, సర్వే విభాగం జోనల్ అధికారి కేశవులు, అన్ని మండలాల తహసీల్దార్లు, సీసీఎల్ఏ సిబ్బంది, రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జానపద పాటలతో ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన

- **నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి.. మొక్కలను నాటి సంరక్షించాలి**

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో శనివారం గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.తెలంగాణ సాంస్కృతిక సారథి దుప్పటి రవి కళాబృందం సభ్యులు జానపద పాటలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షాభావ పరిస్థితులు, వాటి వల్ల కలిగే ప్రభావాలను ప్రజలకు వివరించారు.నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని, విద్యుత్‌ను అవసరమైన మేరకే ఉపయోగించాలని కళాకారులు పాటల ద్వారా సందేశమిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్ల పెంపకంతో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని, భవిష్యత్ తరాల అవసరాల కోసం నీరు, విద్యుత్ వనరులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అవగాహన



కల్పించారు.జిల్లా కలెక్టర్, డీపీఆర్ఓ ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంపై ప్రజలను చైతన్యపరిచేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు దుప్పటి రవి, కొండపర్తి స్వప్న, కంచర్ల శ్యామల, గడ్డం రజిత తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లాలో 8 నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సహకార రుణ వ్యవస్థను బలోపేతం చేసి, రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు, ఇతర సహకార సేవలను మరింత చేరువ చేసేందుకు ఎనిమిది నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఏర్పాటుకు జిల్లా సహకార అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు, తెలంగాణ సహకార సంఘాల చట్టం-1964లోని సెక్షన్ 15-ఏ ప్రకారం జిల్లాలోని ప్రస్తుత సహకార సంఘాల పరిధులను పునర్వ్యవస్థీకరించి ఈ కొత్త సంఘాలను ఏర్పాటు చేయనున్నారు.

నూతనంగా ఏర్పాటు చేయనున్న సహకార సంఘాల వివరాలు:

మహాముత్తారం మండలం: బోర్లగూడెం (ప్రస్తుత సంఘం: మహాముత్తారం)

పలిమెల మండలం: పలిమెల (ప్రస్తుత సంఘం: మహదేవపూర్)

కాటారం మండలం: దామెరకుంట (ప్రస్తుత సంఘం: గారెపల్లి)

మల్హర్‌రావు మండలం: కొయ్యూరు (ప్రస్తుత సంఘం: తాడిచెర్ల)

టేకుమట్ల మండలం: టేకుమట్ల (ప్రస్తుత సంఘం: చిట్యాల)

గోరికొత్తపల్లి మండలం: గోరికొత్తపల్లి (ప్రస్తుత సంఘం: రేగొండ)

మొగుళ్లపల్లి మండలం: మొట్లపల్లి (ప్రస్తుత సంఘం: మొగుళ్లపల్లి)

భూపాలపల్లి మండలం: పాంబాపూర్ (ప్రస్తుత సంఘం: జంగేడు)

ఈ ప్రతిపాదిత పునర్వ్యవస్థీకరణపై ప్రజలు, సంఘాల సభ్యులు, రైతులు, సంబంధిత వ్యక్తులు తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచి 21 రోజుల్లోగా, అంటే డిసెంబర్ 18వ తేదీలోపు సమర్పించాలని అధికారులు తెలిపారు.అభ్యంతరాలను జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) రెండో అంతస్తులో గల గది నంబర్ ఎస్-10లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో లిఖితపూర్వకంగా అందజేయాలని

నూతనంగా ఏర్పాటు చేయబోయే మండలాల వారీగా పాత నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వివరాలు మండలాల వారీగా క్రింది విధంగా ఉన్నాయి:

క్రమ సంఖ్య	మండలం	నూతన PACS పేరు	పాత PACS పేరు
1	మహముత్తారం	బోర్లగూడెం	మహముత్తారం
2	పలిమెల	పలిమెల	మహదేవపూర్
3	కాటారం	దామెరకుంట	గారెపల్లి
4	మల్హర్ రావు	కొయ్యూరు	తాడిచెర్ల
5	టేకుమట్ల	టేకుమట్ల	చిట్యాల
6	గోరికొత్తపల్లి	గోరికొత్తపల్లి	రేగొండ
7	మొగుళ్లపల్లి	మొగుళ్లపల్లి	మొగుళ్లపల్లి
8	భూపాలపల్లి	పాంబాపూర్	జంగేడు

సూచించారు. గడువులోగా అందిన అభ్యంతరాలు, వినతులను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార అధికారి స్పష్టం చేశారు.

దీక్షా దివస్ సభకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

భీమదేవరపల్లి, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నవంబర్ 29వ తేదీకి ప్రత్యేక గుర్తింపు ఉందని బీఆర్ఎస్ మల్లారం గ్రామ శాఖ అధ్యక్షుడు చింత రాజు పేర్కొన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచిందని తెలిపారు.దీక్షా దివస్ సందర్భంగా ఆదివారం కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, తెలంగాణ ఉద్యమ అభిమానులు పెద్ద సంఖ్యలో సభకు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చింత రాజు కోరారు.



అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకుల అప్రమత్తత..

ఖాతాలపై తాత్కాలిక నిలుపుదల ప్రతిపాదన?

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



బ్యాంకింగ్ వ్యవస్థలో సైబర్ మోసాలు, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను నియంత్రించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కొత్త నిబంధనలను రూపొందించినట్లు ప్రచారం జరుగుతోంది. అనుమానాస్పద లావాదేవీలతో సంబంధం ఉన్న బ్యాంకు ఖాతాలపై తాత్కాలికంగా డెబిట్ హోల్డ్ విధించే అవకాశం కల్పించనున్నట్లు సమాచారం. ఈ విధానంలో అనుమానాస్పదంగా గుర్తించిన మొత్తాన్ని లేదా అవసరాన్ని బట్టి ఖాతా నుంచి జరిగే లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.ఖాతాపై నిలుపుదల చర్యలు చేపట్టే ముందు సంబంధిత ఖాతాదారులకు సమాచారం ఇవ్వడం, వారి వివరణను పరిశీలించడం వంటి అంశాలు కూడా ఈ విధానంలో ఉండనున్నట్లు ప్రచారంలో ఉంది. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే బ్యాంకులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని, హోల్డ్ విధించిన 30 రోజుల తర్వాత ఖాతాపై సమీక్ష నిర్వహించాలని పేర్కొంటున్నారు. అయితే, ఈ నిబంధనలకు సంబంధించిన అధికారిక ఆర్బీఐ ప్రకటన, అమలు తేదీ, ఖాతాదారులకు వర్తించే పూర్తి మార్గదర్శకాలు ధృవీకరించిన తర్వాతే ఈ వివరాలను ఖచ్చితమైన నిబంధనలుగా పరిగణించాలి. ఖాతాదారులు తమ బ్యాంకుల నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అనుమానాస్పద సందేశాలు లేదా ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

చిన్నారుల్లో క్షయవ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించాలి: డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



చిన్నారుల్లో క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, సిబ్బందికి నిర్వహించిన జిల్లా స్థాయి ప్రత్యేక శిక్షణ, సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.క్షయవ్యాధి లక్షణాలు కనిపిస్తున్న అనుమానిత చిన్నారులకు వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారి వివరాలను ఎప్పటికప్పుడు నిక్షయ్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. చిన్నారులకు వ్యాధి నిర్ధారణ, చికిత్స అందించే విషయంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. విక్రమ్ కుమార్ వైద్యాధికారులకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు వరంగల్‌కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు శనివారం ఘన స్వాగతం లభించింది. నగరంలోని ఎన్టీ అతిథి గృహానికి చేరుకున్న గవర్నర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం గవర్నర్, ఎమ్మెల్యే కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు, విద్యారంగ ప్రగతిపై చర్చించినట్లు సమాచారం. గవర్నర్ పర్యటన నేపథ్యంలో అతిథి గృహం వద్ద అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఆదివాసీలకే కేటాయించాలి

ఆసిఫాబాద్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజ్యాంగబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని లంబాడీ తెగకు కేటాయించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఆదివాసీలకు సంబంధించిన హక్కులు, సమస్యలకు ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఎస్టీ హోదా, రాజ్యాంగబద్ధమైన ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ఆదివాసీల అభిప్రాయాలు, హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి, ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని ఆదివాసీలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు పంద్రం యశ్వంత్ రావు, కెరమెరి మండల కొల్లాం సంఘం అధ్యక్షుడు సిడం భీంరావు, కుర్నెంగ మారుతి, ఆడ ఆనందరావు, ఆత్రం భీంరావు తమ డిమాండ్‌ను వెల్లడించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రమాదం..

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

ఆసిఫాబాద్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనం మూడో అంతస్తులో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిన ఉత్తమ్ అనే మేస్త్రీ మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఉత్తమ్ నిర్మాణ పనుల్లో భాగంగా మూడో అంతస్తులో పనిచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. తోటి కార్మికుడు మృతి చెందడంతో నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికుల్లో విషాదం నెలకొంది.

ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రమాదం..

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

ఆసిఫాబాద్, నవంబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనం మూడో అంతస్తులో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిన ఉత్తమ్ అనే మేస్త్రీ మృతి చెందారు.స్థానికుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఉత్తమ్ నిర్మాణ పనుల్లో భాగంగా మూడో అంతస్తులో పనిచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆయన మృతి చెందారు. తోటి కార్మికుడు మృతి చెందడంతో నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికుల్లో విషాదం నెలకొంది.

ఈ సమస్య ఉన్నా సరైన తిండి తింటే బరువు తగ్గడం పెద్ద కష్టమేం కాదట

పీసీఓఎస్ ఒకసారి వచ్చిన తర్వాత చాలా కాలం పాటు సమస్యలు కలిగిస్తుంది. ఇది మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా బరువు పెరగడం చాలా సాధారణం. కొంతమంది మాత్రం బరువు తగ్గలేమనుకుంటారు. కానీ ఇది కరెక్ట్ కాదు. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో బరువును తగ్గించవచ్చు.పీసీఓఎస్ ఉన్న వారిలో ఇన్సులిన్ హార్మోన్ సరిగా పని చేయదు. దీని వలన గ్లూకోజ్ స్థాయిలు పెరిగి శరీరానికి ఇన్సులిన్ తగిన విధంగా స్పందించదు. దీని ఫలితంగా శరీరం కొవ్వును నిల్వ చేసుకుంటుంది. ఇలా శరీర బరువు పెరుగుతుంది. అయితే ప్రతిరోజూ తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల బరువును తగ్గించవచ్చు.పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియా జీర్ణక్రియను మెరుగుపరచి బరువును నియంత్రించేందుకు సహాయం చేస్తుంది. కానీ పీసీఓఎస్ ఉన్నవారిలో ఈ మంచి బ్యాక్టీరియా తక్కువగా ఉంటుంది. అందుకే పెరుగు, చద్దన్నం, పచ్చళ్ళు, ఇడ్లీ, దోసె లాంటి పులియబెట్టిన పదార్థాలు తీసుకోవడం మంచిది.ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఎక్కువసేపు ఆకలేయదు. ఇది ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. హార్మోన్ల సమతుల్యత కూడా చక్కబడుతుంది. ఫలితంగా బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి. ఓట్స్, బ్రోకోలి, అవకాడో, బెర్రీస్, తృణధాన్యాలు, యాపిల్స్ వంటి ఫలాలు తినడం మంచిది.పీసీఓఎస్ ఉన్నవారిలో శరీర వాపు ఎక్కువగా కనిపిస్తుంది. దీర్ఘకాలంగా వాపు ఉండడం వల్ల బరువు పెరగడం జరుగుతుంది. దీన్ని తగ్గించేందుకు మెడిటెరేనియన్ డైట్ ఉపయోగపడుతుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె వంటివి ఉండాలి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలను ఆహారంలో చేర్చటం శరీరానికి మేలు చేస్తుంది. కొవ్వులంటే బరువు పెరుగుతుందనే భయం చాలా మందిలో ఉంటుంది. కానీ మంచి కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి. అవకాడో, ఆలివ్ నూనె, నట్స్, కొబ్బరి నూనె వంటివి తినడం వల్ల ఆకలిని తగ్గించవచ్చు. దీని వలన బరువు తగ్గడం సులభమవుతుంది. కేవలం క్యాలరీలు తగ్గిస్తే సరిపోదు. ప్రాసెస్ చేసిన ఆహారాలు, జంక్ ఫుడ్ నుంచి దూరంగా ఉండాలి. గుడ్లు, పాలు, మాంసం, చేపలు లాంటి ప్రోటీన్ ఉన్న ఆహారం తినడం వల్ల ఎక్కువ సేపు ఆకలేయదు. ప్రతివారం కనీసం మూడు రోజులు బరువులెత్తే వ్యాయామాలు చేయడం వల్ల నడుము చుట్టూ ఉన్న కొవ్వు కరిగిపోతుంది. పూర్తి నిద్ర, ఒత్తిడి తగ్గించే యోగా, ధ్యానం చేయడం వల్ల కూడా బరువు తగ్గడంలో సహాయం చేస్తాయి.

ఈ పండ్లను పొరపాటున కూడా ఫ్రిడ్జ్‌లో పెట్టకండి..

రోజువారీ ఆహారంలో పండ్లకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాక.. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే రోజూ తీసుకోవాల్సినవే. అయితే కొందరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు ఫ్రిడ్జ్ సహాయాన్ని తీసుకుంటారు. కానీ కొన్ని రకాల పండ్లను ఫ్రిడ్జ్ లో నిల్వ ఉంచడం వల్ల పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాదు వాటి సహజమైన రుచి, నాణ్యత కూడా తగ్గిపోతుంది. వేసవిలో ఎక్కువగా కనిపించే పుచ్చకాయను చాలా మంది ఫ్రిడ్జ్ లో నిల్వ చేస్తారు. కానీ దీని తేమ, పోషక విలువలు గది ఉష్ణోగ్రతలోనే బాగుంటాయి. ఫ్రిడ్జ్ లో ఉంచినప్పుడు ఇందులో ఉండే లైకోపిన్, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పని చేయలేకపోతాయి. అందువల్ల పుచ్చకాయను ఫ్రిడ్జ్ లో కాకుండా గది ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి.మార్కెట్‌లో లభించే మామిడిపండ్లలో చాలా భాగం ఇథలీన్ వాయువుతో మగ్గించబడుతుంటాయి. అలాంటి పండ్లు ఫ్రిడ్జ్ లో ఉంచితే అవి త్వరగా నల్లబడిపోతాయి. మామిడి ఇంకా మగ్గని దశలో ఉంటే గది ఉష్ణోగ్రతే మంచి పరిష్కారం. పండిన తరువాత కొంతసేపు నిల్వ ఉంచాలంటే ఫ్రిడ్జ్ లో పెట్టవచ్చు కానీ ఎక్కువసేపు ఉంచకపోవడం ఉత్తమం.అరటిపండ్లను చల్ల ప్రదేశాల్లో ఉంచినప్పుడు అవి త్వరగా రంగు మారి నలుపు అవుతాయి. ఫలితంగా అందవిహీనంగా మారిపోతాయి. పైగా రుచి కూడా తగ్గిపోతుంది. కనుక అరటిపండ్లను గదిలో ఉంచితేనే అవి సన్నగా ఉండి రుచికరంగా ఉంటాయి. పండని అవకాడోను ఫ్రిడ్జ్‌లో పెట్టినప్పుడు అది సమయానికి మగ్గకపోవచ్చు. కాస్త మగ్గిన తర్వాత ఫ్రిడ్జ్‌లో ఉంచితే కొంతకాలం నిల్వ ఉంటుంది. కానీ రుచి మెత్తబడకుండా ఉండాలంటే గది ఉష్ణోగ్రతే మేలు చేస్తుంది.చల్లదనంలో ఉంచిన ద్రాక్ష పండ్లు తేమ కోల్పోయి త్వరగా వాడిపోతాయి. ఫలితంగా రుచి తగ్గిపోతుంది.

మత్తుకు దూరం.. క్రీడలే యువతకు ఆధారం

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026

7,000 మందికి పైగా క్రీడాకారులు.. 27 పోటీ క్రీడాంశాలు, రెండు ప్రదర్శన క్రీడాంశాలు

ఆరు నగరాలు.. 20 వేదికల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు

తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. డిసెంబర్ 11 నుంచి 22 వరకు 12 రోజుల పాటు రాష్ట్రంలోని ఆరు ప్రధాన నగరాల్లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరగనున్నాయి. దేశంలోని యువ క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులుగా తీర్చిదిద్దడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ఈ పోటీల ప్రధాన లక్ష్యంమత్తుకు దూరం.. క్రీడలే యువతకు ఆధారం అనే సందేశంతో నిర్వహించనున్న ఈ క్రీడా సంబరాల ద్వారా యువతను మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉంచి క్రీడల వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. క్రీడలను కేవలం పోటీలకే పరిమితం చేయకుండా, సామాజిక మార్పునకు, యువతలో సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు వేదికగా వినియోగించనున్నారు.దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 7,000 మందికి పైగా యువ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. మొత్తం 27 పోటీ క్రీడాంశాలతో పాటు రెండు ప్రదర్శన క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. యువ క్రీడాకారులు తమ ప్రతిభను జాతీయ స్థాయిలో నిరూపించుకునేందుకు ఈ పోటీలు మంచి అవకాశంగా నిలవనున్నాయి.తెలంగాణలోని ఆరు నగరాల్లో ఎంపిక చేసిన 20 క్రీడా వేదికల్లో పోటీలు జరగనున్నాయి. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉండగా, హనుమకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లోనూ వివిధ క్రీడాంశాల పోటీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం, గచ్చిబౌలి క్రీడా సముదాయం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, ఉస్మానియా విశ్వవిద్యాలయ సైక్లింగ్ వెలోడ్రోమ్, హుస్సేన్ సాగర్, హకీంపేట రాష్ట్ర క్రీడా పాఠశాల వంటి ప్రముఖ వేదికలు పోటీలకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇతర నగరాల్లోనూ అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకుని ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రీడలతో యువతకు స్ఫూర్తి.. మాదకద్రవ్యాల రహిత తెలంగాణకు పిలుపు

క్రీడా వేదికల ప్రచారం, అలంకరణ కార్యక్రమాల్లో క్రీడల ప్రాధాన్యతతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన ఆవశ్యకతను చాటిచెప్పనున్నారు. యువతను ఆకట్టుకునేలా పలు సందేశాత్మక నినాదాలను రూపొందించారు.

యువత ఫిట్‌గా ఉండాలి.. తెలంగాణ మాదకద్రవ్యాల రహితంగా ఉండాలి.

క్రీడలతో యువశక్తికి దిశ.. మత్తు పదార్థాలకు అడ్డుకట్ట.

ఆటే అలవాటు.. ఆరోగ్యమే ఆస్తి.



మత్తు వద్దు.. ఆట ముద్దు.

ఐక్యతే లక్ష్యం.. క్రీడలే మార్గం.

గెలుపు కోసం ఆడాలి.. మత్తుకు దూరంగా ఉండాలి.

ఈ నినాదాల ద్వారా యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించనున్నారు. క్రీడలను జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని యువతకు పిలుపునివ్వనున్నారు.

జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రత్యేకతను చాటేలా ప్రచారం

భారత ప్రభుత్వం, భారత క్రీడా ప్రాధికార సంస్థ, ఫిట్ ఇండియా ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో క్రీడల నిర్వహణ, ప్రచారం, ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నాయి. తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం, సంప్రదాయాలు, ఆధునిక క్రీడా సదుపాయాలు, క్రీడాస్ఫూర్తి ప్రతిబింబించేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. తద్వారా జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రత్యేకతను, ఆతిథ్య సామర్థ్యాన్ని చాటిచెప్పనున్నారు.

ఒలింపిక్స్ లక్ష్యంగా యువ క్రీడా ప్రతిభకు వేదిక

దేశంలో క్రీడా సంస్కృతిని విస్తరించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడం ఖేలో ఇండియా కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. 'భారతదేశం ఒలింపిక్స్‌కు సిద్ధం' అనే లక్ష్య సాధనలో భాగంగా భవిష్యత్తులో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై దేశానికి ప్రాతినిధ్యం వహించగల ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు దోహదపడనున్నాయి.దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే క్రీడాకారులు, శిక్షకులు, సాంకేతిక సిబ్బంది, నిర్వాహకులు, క్రీడాభిమానులకు తెలంగాణ ఘన స్వాగతం పలకనుంది. క్రీడల ద్వారా యువతలో ఐక్యత, స్నేహభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 ముఖ్యమైన వేదికగా నిలవనున్నాయి.

గుండె పదిలంగా ఉండాలంటే..

రాత్రి నిద్రకు ముందు పాలను తాగడం అనేది చాలా మందికి ఆరోగ్యకరమైన అలవాటు. అయితే ఈ పాలకు ఖర్జూరం కలిపితే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. పాలు, ఖర్జూరం రెండూ శరీరానికి అవసరమైన పోషకాలు కలిగి ఉంటాయి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల శక్తి పెరుగుతుంది, ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఖర్జూరం సహజంగా శక్తివంతమైన పండు. దీనిలో విటమిన్-ఎ, బీ, జ లాంటి పోషకాలు, అలాగే ఐరన్, పొటాషియం, మాంగనీస్ వంటి మినరల్స్ అధికంగా ఉంటాయి. ఖర్జూరాన్ని కొంత సమయం నానబెట్టి తీసుకోవడం వల్ల ఈ పోషకాలు మరింత శక్తివంతంగా శరీరంలో చేరవచ్చు. ఇది మన రోగనిరోధక శక్తిని పెంచడంలో ఎంతో సహాయపడుతుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. వయస్సు పెరిగే కొద్దీ ఎముకల బలహీనత, కీళ్ళ నొప్పులు వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తాయి. అప్పుడు ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. ఖర్జూరంలో ఉండే మాంగనీస్, కాల్షియం, ఫాస్ఫరస్ వంటి మూలకాలు ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. పాలు అందించే ప్రోటీన్, కాల్షియంతో కలిపి ఈ మూలకాలు ఎముకలకు కావలసిన బలాన్ని ఇస్తాయి.ఖర్జూరం, పాలు కలిసి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మంపై ఎలర్జీలు, మంటలు, పొడిబారిన సమస్యలు ఉంటే.. ఈ పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల ఉపశమనం పొందవచ్చు. ఖర్జూరంలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. పాలు అందించే లాక్టిక్ ఆమ్లం చర్మాన్ని శుభ్రపరుస్తుంది. ఈ రెండు కలిపి తీసుకోవడం వల్ల చర్మం మెరుస్తుంది. పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల కండరాలు బలపడతాయి. ఈ రెండింటిలో ఉండే ప్రోటీన్ శరీరానికి అవసరమైన పోషకాన్ని అందించి కండరాల పునరుద్ధరణను వేగవంతం చేస్తుంది. ముఖ్యంగా శారీరక శ్రమ చేసిన తర్వాత పాలు, ఖర్జూరం కలిపి తీసుకోవడం వల్ల శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి పొందుతుంది. పాలతో ఖర్జూరం తీసుకోవడం వలన రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది హృదయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తప్రసరణ పెరగడంతో శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్ సమర్థంగా అందుతుంది. దీని వల్ల శక్తి స్థాయి పెరుగుతూనే.. ముఖానికి సహజమైన కాంతి కూడా వస్తుంది. ఇలా పాలతో ఖర్జూరం కలిపి తాగడం ద్వారా శరీరానికి శక్తి, ఆరోగ్యం, అందం అందుతాయి.



పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా, దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

